ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మాఫియా
- ప్రభుత్వం నిర్ణయించిన ధరలు బేఖాతరు
- ఇటుకలకు అమాంతం పెరిగిన ధరలు


కమలాపూర్‌లో బెడ్ లెవెల్‌లో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇల్లు

కమలాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ధరాఘాతం విఘాతం కలిగిస్తోంది. ఇసుక మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ఇళ్ల నిర్మాణానికి అత్యంత ముఖ్యమైన ఇసుక అందని ద్రాక్షగా మారుతోంది. ఇళ్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఇసుక మాఫియా బేఖాతరు చేస్తుండగా అమాంతం పెరిగిన ఇటుక ధరలతో ఒక్కో లబ్ధిదారుడిపై రూ. లక్ష వరకు అదనపు భారం పడుతోంది. అధిక ధరలను నియంత్రించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఇసుక, ఇటుక వంటివి అందిస్తే తమకు అదనపు భారం తగ్గి మేలు చేకూరుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు.

మండలానికి 775 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

మండలంలోని 24 గ్రామాలకు మొదటి విడతలో ప్రభుత్వం 775 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన దేశరాజుపల్లికి 150 ఇళ్లు పోగా మిగతా 625 ఇళ్లను అన్ని గ్రామాలకు జనాభా ప్రాతిపదికన మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టగా ప్రస్తుతం నిర్మాణాలకు అవసరమైన ఇసుక కొరత లబ్ధిదారులను వేధిస్తోంది. దీనికి తోడు ఇటుక ధరలను అమాంతంగా పెంచడంతో పెరిగిన ధరలను తట్టుకోలేక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

మానేరు ఇసుకైతే రూ.7 వేలు, లోకల్ ఐతే రూ.4 వేలపైనే

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తామని చెబుతున్నప్పటికీ మండలంలో మాత్రం పరిస్థితి భిన్నంగా తయారైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు లోకల్ ఇసుకను ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు రూ.2 వేలకు, మానేరు ఇసుకైతే రూ.3 వేలకు అందించాలని నిర్ణయించారు. స్థానికంగా వాగుల నుంచి దొరికే ఇసుక నాణ్యత లేకపోగా మట్టి పెళ్లలు వస్తూ దొడ్డుగా ఉంటుండటంతో పుటింగ్‌తో పాటు పిల్లర్లు, స్లాబ్ వేయడానికి కూడా పని చేయడం లేదు. ఇక గోడలు కట్టడానికి, ప్లాస్టరింగ్ చేయడానికి ఆ ఇసుక అసలే పని చేయదు. కానీ ప్రస్తుతం ఇళ్ల లబ్ధిదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఇసుక మాఫియా బరితెగించి లోకల్ ఇసుకనే రూ.4 వేలపైనే పోస్తుండగా, మానేరు ఇసుకను రూ.7 వేల వరకు పోస్తున్నారు. ఇక ప్రస్తుతం మట్టి ఇటుక అయితే అసలే దొరక్కపోగా రెండు నెలల క్రితం వరకు రూ.15 వేలు వరకు ఉన్న లైట్ వెయిట్ ఇటుకను ప్రస్తుతం రూ.20 వేలకు పైగా విక్రయిస్తున్నారు.

ఇసుక దొరకక నిర్మాణం ఆగిపోయింది



మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని తెలిసి చాలా సంతోషించాం. తీరా ఇంటి పని మొదలు పెట్టాక ఇసుక కొరత మొదలైంది. స్థానిక వాగుల నుంచి తెచ్చే ఇసుకకు రూ.4 వేలకు పైనే చెబుతున్నారు. అందులో అంతా మట్టి పెళ్లలే వస్తున్నా యి. ఇక మానేరు ఇసుకకైతే రూ.7 వేలకు పైనే చెప్తున్నారు. అంత ధర చెల్లించలేని పరిస్థితుల్లో ఇంటి నిర్మాణం బెడ్ లెవెల్లోనే నిలిచిపోయింది.

– కొంతం శ్రీలత, కమలాపూర్

నేడు విజయదశమి వేడుకలు

- జమ్మి పూజ..రావణ వధకు ఏర్పాట్లు సిద్ధం

పరకాల: పరకాల పట్టణంలో గురువారం జరిగే విజయదశమి వేడుకలకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు చావడి వద్ద పూజలతో దసరా వేడుకలు ప్రారంభమవుతాయి. సంప్రదాయ ప్రకారం పంచగిరి హరిప్రసాద్ ఇంటి నుంచి జంతు బలికోసం డప్పుచప్పుళ్లతో కత్తిపట్టుకొని బయలుదేరుతారు. బొడ్రాయి వద్ద, బురుజు వద్ద జంతు బలి ఇస్తారు. అక్కడి నుంచి శ్రీచెన్నకేశవాలయం నుంచి స్వయంగా భక్తులు రాముడి రథాన్ని పోటీ పడి లాగుతూ దేవస్థానం ఎదుట జమ్మి పూజ చేస్తారు.

పశువుల సంతలో రావణ వధ

విజయదశమి సందర్భంగా చెడుపై మంచి విజయానికి సూచకంగా పరకాల పట్టణంలోని పశువుల సంతలో రావణ వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.


దసరా ఉత్సవాలకు గడివద్ద ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు

దీని కోసం సుమారు 35 ఫీట్ల రావణాసురుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రావణవధ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. దసరా ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు చేపడతారని పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

మద్యం, మాంసం విక్రయిస్తే చర్యలు : కమిషనర్

పరకాల : గాంధీ జయంతి సందర్భంగా గురువారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని మాంసం (కోళ్లు, మేకలు, గొర్రెలు, ఎద్దులు) దుకాణాలు మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ కె.సుష్మ ఆదేశాలు జారీ చేశారు. తమ ఆదేశాలను దిక్కరించే వారిపై మున్సిపల్ 2019 ప్రకారం చర్యలతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

బాధ్యతల స్వీకరణ




కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అండ్ విభాగం అధిపతిగా డాక్టర్ నల్లాని శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం నుంచి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్, విద్యా కళాశాల డీన్ ప్రొఫెసర్ రాంనాథ్‌కిషన్ అభినందించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ప్రణవ్

కమలాపూర్: మండలంలోని ఉప్పలపల్లికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికి ప్రణవ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తామంతా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నామని కాంగ్రెస్‌లో చేరిన వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలపల్లి, ఉప్పల్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సంగెం ఎస్సైగా వంశీకృష్ణ



సంగెం: సంగెం నూతన ఎస్సైగా కె.వంశీకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎల్.నరేశ్ మిల్స్‌కాలనీకి బదిలీ కాగా టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న వంశీకృష్ణ సంగెం ఎస్సైగా వచ్చారు. మంగళవారం రాత్రి ఆయన సంగెం ఎస్‌హెచ్ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

రావణవధను విజయవంతం చేయాలి


చిన్నవడ్డేపల్లి చెరువులో రావణ వధకు ఏర్పాట్లు

న్యూశాయంపేట: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల పరిధిలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద గురువారం నిర్వహించనున్న దసరా ఉత్సవాలు, రావణ వధ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఏనుమాముల దసరా ఉత్సవ కమిటీ కన్వీనర్ తూర్పాటి సులోచనసారయ్య కోరారు. ఉత్సవాల స్థలంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కన్వీనర్ మాట్లాడుతూ గురువారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అనంతరం 35 అడుగుల రావణ ప్రతిమ వధ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఇంతియాజ్, ముదును నర్సింహ, అడప మహేష్, పోతు చంద్రశేఖర్, చిలువేరు శ్రీనివాస్, కేతిరి రాజశేఖర్, రాజపోశయ్య, స్టాలిన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రామలీల మైదానంలో ఏర్పాట్లు పూర్తి

మడికొండ: మడికొండ మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయం అయోధ్యపురం రోడ్డులోని రామలీల మైదానంలో గురువారం సాయంత్రం జరగనున్న రావణ వధ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్నాస్ నాగరాజు, వరంగల్ ఎంపీ కడియం కవ్య, రాష్ట్ర ఆయిల్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా రావణ వధను నిర్వహిస్తాం

ఖిలా వరంగల్: దసరా ఉత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం తూర్పుకోటలో రావణ వధ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోగి సువర్ణసురేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తూర్పుకోటలో జరిగిన సమావేశంలో మహేష్, దూడయ్య, విజయ్, ధర్మరాజు, రమేష్, జగదీష్, చందర్ పాల్గొన్నారు.

నేడు విద్యానగర్‌లో శమీ పూజ

ఖిలా వరంగల్: వరంగల్ విద్యానగర్‌లో దుర్గామాత శక్తి పూజ, పల్లకీ సేవ, శమీ పూజను గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు అచ్చ వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీమాతో డ్రైవర్లకు ధీమా

నెక్కొండ: నిత్యం ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా వారి కుంటుబాలకు ధీమానిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. గతంలో నవత ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఇచ్చిన మాటకు కట్టుబడి సొంత ఖర్చులతో ప్రమాద బీమా పాలసీ పత్రాలను మండల కేంద్రంలో బుధవారం రంజిత్‌రెడ్డి 160 మంది డ్రైవర్లకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షల పరిమితితో బీమా కల్పించామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. డ్రైవర్లు ఆర్టీఓ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు మోడెం సురేశ్, డ్రైవర్లు శ్రీరం శ్రీనివాస్, ప్రభాకర్, పెండ్యాల రాజు, భద్రూ నాయక్, రాజు, పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన యువకులు

- 185 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాయపర్తి: గంజాయితో యువకులు పట్టుబడిన సంఘటన మండలకేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కన్పించడంతో స్థానికుల సమాచారం మేరకు ఎస్సై రాజేందర్ యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో వారి వద్ద ఉన్న 185 గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. యువకుల్లో ఇద్దరు రాయపర్తి మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు. కేశవాపురం గ్రామానికి చెందిన చిలుముల భరత్, జోగు కార్తీక్, రాపోలు రమేశ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన జానీ తప్పించుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భారత్‌ను విశ్వగురువుగా చేయడమే లక్ష్యం

- ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్‌జీ


ప్రసంగిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్‌జీ

పరకాల: భారత్‌ను విశ్వగురువుగా చేయడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్‌జీ స్పష్టం చేశారు. దీనికోసం ప్రతీ ఒక్కరినీ దేశ నిర్మాణంలో భాగస్వాములై దేశాన్ని పరమవైభవ స్థితికి చేర్చేందుకు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పరకాలలోని మయూరి గార్డెన్‌లో బుధవారం రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్‌ఎస్‌ఎస్) విజయదశమి ఉత్సవాలకు ప్రభుకుమార్ హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యం సామాజిక సమరసతను, కుల, మతవర్గ బేధాలకు అతీతంగా ఐక్యతను తీసుకరావడం జరుగుతుందన్నారు. పర్యావరణ రక్షణతో పాటు స్వదేశీ ఉత్పత్తులను వినియోగిస్తూ, ఆర్థిక స్వావలంభన ద్వారా కుటుంబ విలువలను పెంపొందిస్తు, సంస్కారాన్ని బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పరకాల ఖండ్ సంఘ చాలక్ సాదు సర్వేశం, కార్యవాహ కొడకండ్ల శ్రీకాంత్, జిల్లా ప్రచారక్ విష్ణుజీ, జంబుకం రమేశ్, కాటిక మహేందర్, అనంతుల మహేష్, మినుపాల ప్రవీణ్, గంధ్ర శ్రీనివాస్‌రెడ్డి, పలు ప్రముఖ సేవా సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ధర్మసాగర్ : ధర్మసాగర్ గ్రామ ప్రజలు ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరు కూడా పబ్లిక్ ప్లేస్ లలో రాజకీయ పార్టీలు, ఇతర జెండాలు, పోస్టర్స్, బ్యానర్స్ పెట్టరాదని, వాల్ పెయింటింగ్స్ రాయరాదని అన్నారు. వారి సొంత ఇంటికి ఫ్లెక్సీ, జెండాలు పెట్టుకోవాలంటే గ్రామ పంచాయతీ ద్వారా మండల ఎన్నికల అధికారి (ఎంపీడీఓ)అనుమతి పొందిన తర్వాత పెట్టుకోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత ఫోన్‌లో వాట్సాప్ డీపీగా పార్టీ గుర్తులు, రాజకీయ నాయకుల ఫొటోలు, పార్టీ జెండాలు పెట్టుకోరాదన్నారు. పార్టీలకు సంబంధించిన విషయాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వీడియోలు పోస్టు చేయరాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు.

మహిషాసురమర్ధిని అవతారంలో అమ్మవారు


పరకాల : అన్నదానం ప్రారంభిస్తున్న డాక్టర్ సంతోష్‌కుమార్

పరకాల : పట్టణంలోని కనకదుర్గ మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహాన్నదానం చేపట్టగా ప్రముఖ వైద్యుడు సిరంగి సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, కాచం గురుప్రసాద్, నాగెల్లి రంజిత్ ఇంగిళి వీరేశ్‌రావు, ముసినిపల్లి శివప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి, శాలిని శివుడు, శ్రీకాంత్ భక్తులు పాల్గొన్నారు.


ఎల్కతుర్తి : మహిషాసురవర్ధిని రూపంలో దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహిషాసురవర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సుల్లో నైపుణ్యంతో ఉపాధి

సంగెం: విద్యార్థులు వృత్తివిద్యా కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుంటే ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి పొందవచ్చని వృత్తి విద్యా కోఆర్డినేటర్ అనిల్ అన్నారు. మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు బ్యూటీ, వెల్‌నెస్ కోర్సులో భాగంగా దసరా సెలవుల్లో వరంగల్‌లోని పూజ అకాడమిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినులను బుధవారం కలిసిన ఆయన శిక్షణ గురించి తెలుసుకున్నారు. ఇంటర్న్‌షిప్ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు.


విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న కోఆర్డినేటర్ అనిల్

కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా ఉంటుంది


విజేతలను సన్మానిస్తున్న సంస్థ బాధ్యులు

న్యూశాయంపేట: జీవితంలో ఏదైనా సాధించాలంటే కష్టపడాలని, అందుకు ప్రతిఫలం కచ్చితంగా ఉంటుందని వరంగల్ ఇస్లామియా డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బహదూర్ అలీ అన్నారు. ఇటీవల గ్రూప్ -1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన మహ్మద్ విలాయత్ అలీ, ఎంపీడీఓగా నియమితులైన మహ్మద్ రైసుల్లా సన్మాన సభను అప్నా వరంగల్ సంస్థ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ అబ్దుల్ జబ్బార్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో ప్రముఖ కవి వాహిద్ గుల్షన్ వ్యాఖ్యాతగా వ్యవరించగా, ఖాజాయాఖూబ్‌షా చిస్తీ, మౌలానా ఫసియొద్దీన్ ఖాస్మీ, అబ్దుల్ సుభాన్, మహ్మద్‌అలీ జుబేర్, సర్వర్ (మున్నాభాయ్), జుబేర్ గపూరీ, ముగ్దుం మొహియొద్దీన్, ఇస్మాయిల్ జబీ, మహ్మద్ మునవర్, ఎంఎఫ్ బేగ్ (రియాజ్) అబ్దుల్ సత్తార్, తౌసిఫ్, సల్మాన్, అజర్‌ఖాన్, ఇస్మాయిల్ జబీ, హమీద్ హుస్సేన్, అమీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం'లో యువతకు పెద్దపీట

నర్సంపేట/దుగ్గొండి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజా ప్రతినిధులను చేస్తానని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు దుగ్గొండి మండలం రాజ్యాతండా, గోబ్రా తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, నెక్కొండ మండలం చెరువుముందుతండా గ్రామానికి చెందిన పలువురు యువకులు బుధవారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రాజగోపాల్, ఎడ్ల సతీష్, అన్న బోయిన రాజు, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజయదశమి శుభాకాంక్షలు



వరంగల్ అర్బన్: విజయదశమి పర్వదినం సందర్భంగా నగర ప్రజలకు మేయర్ గుండు సుధారాణి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. చెడుపై మంచి విజయంగా విశ్వాసాన్ని సూచిస్తుందని, అంతిమంగా మంచి శక్తులే విజయం సాధిస్తాయనే నమ్మకాన్ని దసరా పండుగ బలపరుస్తుందని ఆమె తెలిపారు.

రేపటి బంద్ వాయిదా

న్యూశాయంపేట: కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ఈ నెల 3న జరగాల్సిన బంద్.. బోర్డు సూచనల మేరకు వాయిదా పడినట్లు ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో మరో తేదీని బోర్డు ప్రకటిస్తుందని పేర్కొన్నారు.

బెనిఫిట్స్ సాధనకు కమిటీ ఏర్పాటు


సమావేశమైన రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: ఉద్యోగ విరమణ పొందుతున్న, పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ సాధించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ బెనిఫిట్స్ సాధన సమితిని ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీధర్ల ధర్మేంద్ర అధ్యక్షతన బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 5న రిటైర్డ్ ఎంప్లాయిస్ బెనిఫిట్స్ సాధన సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని తీర్మానించారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కడారి భోగేశ్వర్, ఎండీ.గఫార్, చంద్రమౌళి, ఎండీ.మహ్మద్ అలీ, సూర కుమారస్వామి, దామోదర్, శ్యామ్‌రావు, వెంకటేశ్వర్లు, శ్యామ్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సంజీవరెడ్డి, సదయ్య, విశ్వనాథం, ఇంద్రసేనారెడ్డి, సురేందర్, వీరయ్య, కృష్ణమూర్తి, రత్నాకర్‌రెడ్డి, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీల చింపివేత



న్యూశాయంపేట: చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద దసరా ఉత్సవాలను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపివేయడం కలకలం రేపింది. బాధ్యులపై చర్య తీసుకోవాలని పోలీసులకు పార్టీ నాయకులు ఫిర్యాదు చేయగా, ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ సురేష్.. సంఘటనా స్థలాన్ని బుధవారం సందర్శించి పరిశీలించారు.

వృద్ధుల సంరక్షణే ధ్యేయం


వృద్ధులను సన్మానిస్తున్న సైకిల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

విద్యారణ్యపురి: వృద్ధుల సంరక్షణే ధ్యేయం కావాలని, వారి అనుభవాలను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి సూచించారు. వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ప్రతాపరుద్ర కాలనీలో వృద్ధులు మామిడి నర్సయ్య, బండారి మల్లయ్యను అసోసియేషన్ సభ్యులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అనంత్, బాధ్యులు రమేష్, రాపర్తి లక్ష్మయ్య, నర్సయ్య, రవి, శేఖర్‌గౌడ్, సునీల్‌రెడ్డి, వెంకన్న, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి హఠాన్మరణం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగిగా సేవలందించి నాలుగు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందిన మహ్మద్ అబ్దుల్ శుకూర్ (61) బుధవారం గుండెపోటుతో మరణించారు. కాజీపేటలోని డీజిల్‌కాలనీకి చెందిన అబ్దుల్ శుకూర్ మృతికి కేయూలోని ఉద్యోగులు, వివిధ ఉద్యోగ సంఘాల బాధ్యులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.